క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి బంగారం విరాళం



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి ఆదివారం కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన గోనెల గోవిందు రాములమ్మ దంపతులు అరతులం బంగారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామంలో వాల్మీకి కట్ట వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం వేప చెట్టు, రాగి చెట్టుకు పెళ్లి తంతు నిర్వహిస్తున్నట్లు పండితులు శ్రీకాంత్‌శర్మ తెలిపారు. ఈ సందర్భంగా చెట్లను అందంగా అలంకరించి ముస్తాబు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మతాల పేరుతో రాజకీయం



ఉండవెల్లి: మతాల పేరుతో బీజేపీ రాజకీయం చేస్తూ పబ్బం గడుపుతుందని సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కంచుపాడు గ్రామంలో ఆదివారం సురవరం విజ్ఞాన కేంద్రంలో సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్లను మండల కన్వీనర్ నాగార్జున ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ నెల 7న జరిగే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు రవి, సీపీఐ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో నానా అవస్థలు



మానవపాడు: మండల కేంద్రం నుంచి చెన్నిపాడు వెళ్లే మార్గంలో నానా అవస్థలు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుపై మోకాలి లోతులో గుంతలు ఏర్పడి అవస్థలు పడుతున్నట్లు పేర్కొంటున్నారు. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అంతర్జాతీయ క్రీడలకు ఎంపిక అభినందనీయం



ఆత్మకూర్: అంతర్జాతీయ గోల్‌బాల్ పోటీలకు ఎంపికైన ఆత్మకూర్‌కు చెందిన సమ్మిళిత ఫౌండేషన్ విద్యార్థి పవన్‌కల్యాణ్, భారతజట్టు కోచ్‌గా ఎంపికైన సంస్థ డైరెక్టర్ శివకుమార్‌ను వాసవీ క్లబ్ నిర్వాహకులు సన్మానించారు. ఆదివారం సంఘం సభ్యులు సన్నబియ్యంతో పాటు నగదు అందజేశారు. ఈజిప్టు దేశంలో సెప్టెంబర్ మొదటివారంలో జరిగే గోల్‌బాల్ క్రీడల్లో పవన్ క్రీడాకారుడిగా, శివకుమార్ కోచ్‌గా ఎంపికవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామ్మోహన్, యశ్వంత్, భరత్, నీలేష్, నవీన్, రాఘవేందర్, రాజేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు పరిరక్షించాలి

ఇటిక్యాల: మండలంలో శాంతి భద్రతలు పరిరక్షించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ రవిని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రుక్మందర్ రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రాజ్‌కుమార్, అల్లబకాష్, మద్దిలేటి, రాముడు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్లు



మధ్యలో నిర్మాణాన్ని నిలిపేసిన బస్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ డీఎం సునీత

- ఒక షెల్టర్ అసంపూర్ణం
- దాతలు నిర్మించినది ఆక్రమణ

అయిజ: మండల కేంద్రంలోని కర్నూలు–రాయచూర్ రోడ్డు సర్కిల్, పాత బస్టాండ్‌లోని చౌరస్తాలో నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్లతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల రాక కోసం మండుటెండలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. దాతలు నిర్మించిన షెల్టర్ కూడా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవస్థలు పడుతున్నట్లు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దాతలు సహకారంతో

అయిజ పాత బస్టాండ్ చౌరస్తా ప్రదేశంలో దాతలు (తోట బ్రదర్స్) నిర్మించిన బస్ షెల్టర్ నిరుపయోగంగా ఉంది. బస్ షెల్టర్ ముందు ఉన్న స్థలాన్ని చిరు వ్యాపారులు ఆక్రమించి పూలు, పండ్లు విక్రయించేందుకు స్థావరం ఏర్పాటు చేసుకోవడంతో ప్రయాణికులు షెల్టర్ కింద కూర్చోవడానికి వీలు లేకుండా పోయింది.



అయిజ పాత బస్టాండ్‌లో నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్

అసంపూర్తిగా షెల్టర్ నిర్మాణం

రాయచూర్– కర్నూల్ రోడ్డు సమీపంలో మున్సిపాలిటీ అధికారులు గత అసెంబ్లీ ఎన్నికల ముందు హడావిడిగా చేపట్టిన బస్ షెల్టర్ నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. షెల్టర్ నిర్మిస్తే తమకు ఇబ్బందిగా ఉంటుందని నిర్మాణం పనులు నిలిపివేయాలని కొందరు వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు ఆ కేసును కొట్టివేసింది. అయినా సరే కాంట్రాక్టర్ నిర్మాణం పనులు పూర్తి చేయలేదు. అయితే నిర్మాణం బస్ షెల్టర్‌కు అనుకూలంగా లేదని, దాన్ని ఉపయోగించుకోవటానికి పనికిరాదని ఇటీవల షెల్టర్‌ను పరిశీలించిన ఆర్టీసీ డీఎం సునీత పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్‌షెల్టర్లు వినియోగం తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిర్మాణం పూర్తి చేయాలి



కొత్త బస్టాండ్ సమీపంలో మున్సిపల్ అధికారులు చేపట్టిన బస్ షెల్టర్ నిర్మాణం పనులు పూర్తి కాలేదు. దీంతో ఆ ప్రదేశంలో బస్సులు నిలువడం లేదు. నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలి

– వెంకటేష్, గుర్రంతోట కాలనీ, అయిజ

సమస్యలు పరిష్కరిస్తాం



పాతబస్టాండ్‌లో దాతలు నిర్మించిన బస్ షెల్టర్‌కు కొన్ని మార్పులు చేసి వినియోగంలోకి తెస్తాం. రాయచూర్– కర్నూలు రోడ్డు పక్కన నిర్మించిన బస్ షెల్టర్ నిర్మాణం ప్రజలు కూర్చోవడానికి ఉపయోగకరంగా లేదు.

– సునీత, డిపో మేనేజర్

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి



రోడ్డుపై నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

అయిజ: పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రుళ్లు చిమ్మచీకటి అలముకుంటుందని, వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తబస్టాండ్‌లో బీజేపీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ప్రధాన కూడలిలో నాలుగు సంవత్సరాల క్రితం హైమాస్ట్ లైట్‌కు సంబంధించిన స్తంభం విరిగి పడిందని, ఇప్పటి వరకు అక్కడ కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. గత రెండు సంవత్సరాల నుంచి ఇద్దరు మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రాలు అందజేస్తున్నామని, కమిషనర్లు మారుతున్నారుగాని హైమాస్ట్ లైట్లు మాత్రం ఏర్పాటు చేయలేదని విమర్శించారు. పట్టణంలో 20 వార్డుల్లో కాంగ్రెస్ నాయకులు చెప్పిన ప్రదేశాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారని, అవసరమైన ప్రదేశాల్లో మాత్రం ఏర్పాటు చేయలేదని విమర్శించారు. అధికారులు స్పందించకుంటే ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రదీప్ కుమార్, లక్ష్మణ్‌గౌడ్, లక్ష్మణాచారి, రఘు, వీరేష్, వెంకటేష్, శివయ్య పాల్గొన్నారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు

గద్వాల: పట్టణంలోని భీంనగర్‌లో ప్రభుత్వ బీసీ సంక్షేమ బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు నిత్యం పురుగుల అన్నం పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్న హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం విద్యార్థులతో కలిసి హాస్టల్ గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతూ ధర్నా చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్ తక్షణమే స్పందించాలని పేర్కొన్నారు.

శిథిల భవనాలు తొలగించండి సారూ..!



పగుళ్లిచ్చిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం



శిథిలావస్థలో ఉన్న పాత భవనం

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాత భవనం శిథిలావస్థకు చేరింది. పాఠశాలలో వస్తువులు చెల్లాచెదురుగా ఎక్కడపడితే అక్కడ ఉన్నాయి. పాఠశాల పాత భవనాలు శిథిలమై నిరుపయోగంగా ఉన్నాయి. నిరుపయోగంగా ఉన్న శిథిల భవనాలను వెంటే తొలగించి, క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



చెల్లా చెదురుగా ఉన్న వస్తువులు

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తుల్ల వీరేందర్‌గౌడ్



పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తుల్ల వీరేందర్‌గౌడ్

మల్దకల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు తమవంతు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తుల్ల వీరేందర్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జ్ డీకే స్నిగ్ధారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు సూచించారు. ఆదివారం మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బిజ్వారం గ్రామంలో పార్టీ బూత్ అధ్యక్షుడు ప్రతాప్, రాధాకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మోసపూరితమైన మాటలతో ప్రజలను మభ్యపెడుతూ కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నరేంద్రమోదీ దేశ ప్రజల అభివృద్ధి కోసం చేపడుతున్న పథకాలు సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఉచిత బియ్యం, సుకన్య సమృద్ధి యోజన, ఆయుష్మాన్ భారత్ పథకం , బీమాయోజన, కిసాన్ క్రెడిట్‌కార్డులు వంటి వాటిని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల ప్రజల మనసు గెలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, బండల వెంకట్రాములు, శివారెడ్డి, జయశ్రీ, వెంకటేశ్వర్‌రెడ్డి, దామ నాగరాజు, తిమ్మారెడ్డి, ఈరన్న గౌడు, రాముడు, దర్శెల్లి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సాయం



హుస్సేన్ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న యూనియన్ నాయకులు

గద్వాల: ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన హుస్సేన్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గద్వాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూ.6 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన సమావేశంలో హుస్సేన్ కుటుంబ సభ్యులకు చెక్ అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. హుస్సేన్ మరణం టీఎస్‌యుటీఎఫ్ యూనియన్‌కు తీరని లోటన్నారు. యూనియన్‌లో జిల్లా కార్యదర్శిగా పని చేసిన ఆయన విశేష సేవలందించారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తరఫున నిర్వహించబడుతున్న ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్‌లో సభ్యులుగా ఉంటూ మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర కమిటీ తరఫున ఆర్థిక భరోసా అందించేలా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంఘం ఉత్తమ సేవలందించాలి



ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న నూతన కార్యవర్గం

గద్వాల: రవాణ పరంగా ఉత్తమ సేవలందిస్తూ లారీ ఓనర్ల సంఘం ముందుకు సాగాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో రాజీవ్‌మార్గ్‌లో గద్వాల లారీ ఓనర్ల నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం నూతన కార్యవర్గం సభ్యులు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు, లారీల యజమానులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దౌలత్ పీర్ ఉర్సు

గద్వాల: జిల్లా కేంద్రంలోని ఔటర్‌రింగ్ రోడ్డు సమీపంలోని దర్గాలో దౌలత్‌పీర్ ఉర్సు ఘనంగా నిర్వహిస్తున్నారు. నాలుగు రోజులుగా మతాలకు అతీతంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం దర్గా కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముతావలి ముస్తాక్ అహ్మద్, అతికూర్ రహమాన్, ఆజం, వలిపుర్‌ఖాన్, మంజూర్, షఫి, దర్సెల్లి తదితరులు పాల్గొన్నారు.

బీచుపల్లిని సందర్శించిన ప్రముఖులు



బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, తదితరులు

ఎర్రవల్లి: మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని ఆదివారం మాజీ ఎంపీ రాములు, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి వేర్వేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు అభయాంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ సిబ్బంది వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఈఓ రామన్‌గౌడ్ వారిని శేషవస్త్రాలతో సత్కరించగా.. అర్చకులు మారుతిచారి తీర్థ ప్రసాదాలను అందించి ఆలయ విశిష్టతను గురించి వివరించారు. వారి వెంట ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

పెద్ద చెరువుకు నీటిని తరలించాలి



రైతులతో మాట్లాడుతున్న ప్రకాష్‌రెడ్డి

అమరచింత: భూత్పూరు రిజర్వాయర్ ఎడమ కాల్వ ద్వారా అమరచింత పెద్ద చెరువుకు నీటిని తరలించి సాగునీటి సమస్యలు పరిష్కరించాలని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డిని ఆదివారం రైతులు కలిసి సమస్య విన్నవించారు. ఈ మేరకు ప్రకాష్‌రెడ్డి సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లగా కాల్వలో జమ్ము, ముళ్లపొదలు పెరిగాయని దీంతో నీటి సరఫరాకు ఆలస్యమవుతున్నదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కాల్వలోని జమ్ము తొలగించేందుకు అయ్యే ఖర్చును తాను చెల్లిస్తానని మరమ్మతు చేపట్టమని ప్రకాష్‌రెడ్డి అధికారులకు వివరించారు. దీంతో సోమవారం కాల్వను సందర్శించి పొక్లెయిన్ ద్వారా జమ్ము తొలగిస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, కోదండరాంరెడ్డి, జయసింహారెడ్డి, ఎస్‌ఎ. రాజు, శ్యామ్, పిన్నంచర్ల, పాంరెడ్డిపల్లె రైతులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

ఆత్మకూర్: మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తానని యార్డ్ చైర్మన్ రహ్మతుల్లా అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు రహ్మతుల్లాను సన్మానించారు. యార్డు కొత్త భవనం కోసం రూ.80 లక్షలతో ప్రతిపాదనలు చేశామని, యార్డులో 200 షాపులను నిర్మించాలని మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే అనుమతులు రానున్నాయన్నారు. మంత్రి సహకారంతో ఆత్మకూర్ మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, దామోదర్, సాయిరాఘవ తదితరులు పాల్గొన్నారు.

‘బీసీ రిజర్వేషన్‌పై ఢిల్లీలో చర్చించేలా చేశాం’

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ రిజర్వేషన్ గురించి దేశ రాజధాని ఢిల్లీలో చర్చించేలా సీఎం రేవంత్‌రెడ్డి చేశారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం పాతపాలమూర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా డబుగుబలహీన, అనగారినవర్గాల స్థితిగతులను ఆయన స్వయంగా తెలుసుకున్నారన్నారు. బీసీలకు రిజర్వేషన్ కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిందన్నారు. చిత్తశుద్ధితో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి కులగణన చేయించిందన్నారు. న్యాయనిపుణుల సలహాలు తీసుకుని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు ఎన్పీ వెంకటేశ్, గోపాల్‌యాదవ్, మైత్రి యాదయ్య, కృష్ణ ముదిరాజ్, చందుయాదవ్, శ్రీనివాసులు, వెంకటనర్సయ్య, శ్రీనివాస్‌సాగర్, గుండా మనోహర్, సంజీవ్‌రెడ్డి, భారత్‌కుమార్, బుగ్గన్న తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న సంతలు



వడ్డేపల్లిలో శుక్రవారం మందకొడిగా సాగుతున్న గొర్రెల సంత

- డీలా పడిన గొర్రె, పొట్టేళ్ల అమ్మకాలు
- శ్రావణ మాసం కారణంగా తగ్గిన మాంసం విక్రయాలు
- ధరలు లేక వెనక్కు వెళుతున్న వ్యాపారులు

రాజోళి: గొర్రెల సంతలకు శ్రావణమాసం ఎఫెక్ట్ పడింది. ఏడాది మొత్తం బిజీగా సాగే గొర్రెల సంతలు అమ్మకాలు, కొనుగోళ్లు లేక వెలవెలబోతున్నాయి. నిత్యం వందలాది మంది రైతులు తమ జీవాలను తీసుకొచ్చి లాభాలకు అమ్ముకొని వెళ్లే సంతల్లో ఈ నెల ఆరంభంలోనే విక్రయాలు జరుగక జీవాల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు మాంసం వ్యాపారులు కూడా తగ్గిన మాంసం విక్రయాల కారణంగా నష్టాలను చవిచూడాల్సి వాపోతున్నారు.

బోసిపోయిన సంతలు

జిల్లాలో ఎక్కువగా గద్వాల, వడ్డేపల్లి, అయిజ సంతల్లో గొర్రెలు, పొట్టేళ్లు, మేకలు, నాటుకోళ్ల విక్రయాలు జరుగుతుంటాయి. వీటి అమ్మకాల కోసమే ప్రత్యేకంగా బజార్‌ను ఏర్పాటు చేశారు. కొనుగోలు చేసే వాళ్లు సంబంధిత సంత అజమాయిషీకి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇది కూడా రూ.లక్షల్లో వేలం పాడి దక్కించుకుంటారు.



పక్క రాష్ట్రాల నుంచి కూడా

కర్నూలు, రాయచూర్, పెబ్బేరు, ఎమ్మిగనూరుకు తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు నుంచి గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి, అయిజ, గద్వాల సంతల్లో విక్రయాలు సాగిస్తుంటారు. ఇందులో మేకలు, గొర్రెలు, పొట్టేళ్లు అమ్మేవారు, కొనేవారితో పాటు మాంసం విక్రయాలు చేసుకునే వారు వస్తుంటారు. వందలాది వాహనాల్లో వేలాది మంది వ్యాపారులు వచ్చి రూ. లక్షల్లో బేరాలు సాగిస్తుంటారు. అలాంటి సంతలు నేడు బోసిపోయి కనిపిస్తున్నాయి. పట్టుమని వంద మంది కూడా కనిపించకుండానే, పదుల సంఖ్యలో అమ్మకాలు మందకొడిగా చేసుకుని సంత ముగుస్తుందని వ్యాపారులు వాపోతున్నారు.

ధరలు లేవు



పొట్టేళ్లు, గొర్రెలు సంతలో విక్రయిస్తుంటాం. ఈ వారం సంతలో కనీసం గిట్టుబాటు ధర కూడా పలకడం లేదు. దీంతో జీవాలు విక్రయించకుండా వెనక్కు వచ్చాం. ఇతర ప్రాంతాల నుంచి సంతకు వచ్చిన వారికి ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు కూడా రావడం లేదు. చాలా మంది అమ్మకాలు చేసుకోలేక వెనక్కు వెళ్లిపోతున్నారు.

– ఉమేందర్, వ్యాపారి, శాంతిగనర్

పదుల సంఖ్యలో కోతలు



గతంలో రోజూ వందల సంఖ్యలో కోళ్లను కోసేవాళ్లం. మటన్ విక్రయాలు కూడా బాగా ఉండేది. ప్రస్తుతం కోళ్లనే పదుల సంఖ్యలో మాంసం కోసం వినియోగిస్తున్నాం. శ్రావణ మాసం విక్రయాలు మందకొడిగానే ఉంటాయి. దీంతో ఇతర ప్రాంతాల నుంచి సంతలకు వచ్చే వారికి కూడా వ్యాపారం పెద్దగా ఉండటం లేదు.

– చాంద్ బాషా, మాంసం వ్యాపారి, శాంతినగర్

శ్రావణమాసం ఎఫెక్ట్

శ్రావణమాసం ప్రారంభం కావడంతో మాంసం విక్రయాలు సాధారణంగా ఉండటంతో, మేకలు, పొట్టేళ్ల అమ్మకాలు కూడా మందకొడిగానే సాగుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. హోటళ్లు, దాబాల్లో సైతం మాంసం ముట్టకపోవడంతో మొదటి వారంలోనే పెద్ద ఎత్తున విక్రయాలు పడిపోయాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.